
# కర్మయోగి

— రోహిణీ సత్య



రిటైరైన రామారావుకు కాలం గడపడం చాలా కష్టంగా ఉంది. కానీ కాలం గడపడానికి ఏదైనా ప్రయత్నం చేయాలిగా! అందుకే ఆర్థికంగా చీకూ చింతా లేని అతడు కొన్ని సంఘాలలో సభ్యుడై, ఆ యా సంఘాల సభలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యేవాడు.

అలాంటి ఒక సంఘం పండుగ సందర్భంగా ఆ రోజు విశేష సభను జరుపుకుంటోంది. రామారావుకు ఈమధ్యనే తనలాగే రిటైరైన పట్టాభితో పరిచయమయింది. ఇద్దరూ ఆ రోజు అక్కడ కలవడంతో పక్కపక్కగా కూర్చుని ఒకరి వెంట ఒకరు చేస్తున్న ప్రసంగాలు వినసాగారు.

చివరగా సంఘం సభ్యుల తరపున ఒక వ్యక్తి తన ఉపన్యాసాన్ని ఆరంభించాడు.

"ప్రస్తుత కాలంలో బ్రాహ్మణీకం తగలడిపోతోంది. బ్రాహ్మణులకు విలువ లేకపోతోంది. మనలో మనకు ఐకమత్యం లేదు. ఎదుటి వాళ్ళు ఏ మాత్రం బాగున్నా ఓర్వలేక మనలో మనమే తన్నుకులాడటం వల్ల మన కీ దుస్థితి వచ్చింది.

"జాతి ధర్మాన్ని నిలబెట్టాలన్న ధ్యేయం కలిగి అడుగంటిపోతున్న సంప్రదాయాలను, శాస్త్రాలను ఉద్ధరించే ఇలాంటి సంఘ సంస్థలకు కాస్త సాయపడుతూ అందరూ సమష్టిగా జాతి ఉన్నతికి పాటుపడాలని కోరుతున్నాను. అలాగే పొట్టకూటికై బ్రాహ్మణత్వానికే మసిపూసే, నీచమైన పనులు చేసే బ్రాహ్మణులను వెలివేయాలి. అలాంటివారి వల్ల మన జాతికి తీరని అవమానం జరుగుతోంది ... " అలా సాగింది అతడి వాగ్ధోరణి.

రామారావుకు ఇలాంటి ప్రసంగాలు కామన్. ఏదో పొద్దు గడపాలని వచ్చి, అలా విని వదిలేయడం అలవాటు. కానీ ఆ ఊరికి కొత్తగా వచ్చిన పట్టాభికి మాత్రం అతడి ప్రసంగం అద్భుతం అనిపించింది.

సభ ముగిశాక ఇద్దరూ ఇంటివైపుగా బయలుదేరారు. అప్పుడు గుర్తొచ్చింది రామారావుకి - భార్య ఉద్యోగాల వేటలో పడ్డ రెండో కొడుకు పేరిట విఘ్ననాశకుడైన విఘ్నేశ్వరుడికి గుళ్లో అర్చన చేయించమన్న విషయం.

ఇద్దరూ కలిసి కాస్త దూరంలో ఉన్న వినాయకుడి ఆలయం వైపు దారి తీశారు. పండుగ సందర్భంగా గుడిని విశేషంగా అలంకరించారు. రామారావుతోబాటు అడుగులేస్తున్న పట్టాభికి తన కొత్త చెప్పుల మీద బెంగగా ఉంది. కానీ అక్కడో కుర్రాడు బోలెడన్ని చెప్పుల జతలను వరసగా జోడిస్తూ టోకెన్లు ఇవ్వడం చూసి కాస్త కుదుటపడ్డాడు.

రామారావు ఆ కుర్రాడికి కాస్త దూరంలో చాలా కొద్ది జతల చెప్పులతో కూర్చున్న ఓ ముసలతని వద్దకు వెళ్లడంతో పట్టాభి బెంగ మళ్లీ మొదలైంది. అదేమాట సంకోచిస్తూ రామారావుతో అన్నాడు. రామారావు చిన్నగా నవ్వుతూ, "ఓ! గుడికి మీ రిదే మొదటిసారి రావడం అనుకుంటా! మీ రేం బెంగ పడకండి! ఇతని వద్దనే చెప్పులు వదలడం నా కలవాటు. గుళ్లో ఎంతటి సందడున్నా మన చెప్పులు మనం గంటలతరబడి చుట్టుకొచ్చినా

అక్కడే ఉంటాయి!" అన్నాడు.

దర్శనం ముగించుకుని ప్రసాదం తీసుకుని కాసేపటికి బయటికొచ్చారు. రామారావు చెప్పులు తొడుక్కుంటూ యాభై పైన ఇవ్వబోతున్న పట్టాభిని వారిస్తూ ఒక రూపాయి కాగితం అతడి చేతిలో ఉంచాడు.

ఇంటివైపుగా బయలుదేరుతూ, "రెండు జతల చెప్పులకు జతకు ఇరవైఅయిదు పైసల చొప్పున యాభై పైసలేగా!" చిన్నబుచ్చుకుంటూ, రామారావు పట్టాభి భుజం తడుతూ, "నిజమేనండీ! నేను రూపాయి ఇచ్చింది మిమ్మల్ని కించపరచాలని కాదు.

"ఆ ముసలాయన కూడా మనలాగే బ్రాహ్మణ కులానికి చెందినవాడు. పూజలు చేయిస్తూ, కర్మలు చేయిస్తూ నలుగురి ఆడపిల్లల తర్వాత పుట్టిన ఒక్కగానొక్క కొడుకును తన వృత్తిలో దింపక చదివించి మంచి ఉద్యోగంలో చూడాలన్న తపనతో కూతుళ్లకు కూడా సుమారులో సంబంధాలు కుదిర్చి కొడుకుని చదివించాడు. కానీ అతగాడికి అంతంతమాత్రంగా చదువు అబ్బి, ఏదో చిన్న ఉద్యోగం వెలగబెడుతున్నాడు. పెళ్లయ్యాక తమ సంసారానికి ఈ ముసలి తల్లిదండ్రులు అదనపు భారం అనుకుని ఇద్దరినీ బయటికి గెంటాడు.

"తాను పాలు పోసి పెంచింది విషనాగు అని తెలుసుకునేసరికి కాలం గడిచిపోయింది. కట్టుబట్టలతో వీధినపడ్డ అతడికి అతనితోబాటు భార్యను కూడా పోషించుకోవలసిన పరిస్థితి అనివార్యమయింది. తనను నమ్మి తనతోబాటు ఏడడుగులు నడిచి తన కష్టసుఖాలలో పాలుపంచుకున్న తన భార్య కోసం ఇప్పుడు ఈ పనికి దిగాడు."

వింటున్న పట్టాభి నిర్ఘాంతపోయాడు -

## అందరాని గ్రంథం

లండన్‌లోని ఓ వేలం శాలలోకి అతి పవిత్రమూ, అపురూపమూ అయిన ఓ గ్రంథం వేలానికి వచ్చింది. 'ది గాస్పెల్స్ ఆఫ్ హెన్రీ' అనే పేరు గల ఈ పుస్తకం క్రీస్తు పూర్వం 1170వ సంవత్సరానికి చెందింది. 226 పుటలు కల ఈ పుస్తకాన్ని హారిమన్ అనే మతాధికారి స్వయంగా తనే రాశాడుట. అంతేకాక పుస్తకంలో ఈయనే చిత్రించిన 46 వర్ణ చిత్రాలు కూడా ఉన్నాయి. అమూల్యమని చెప్పదగ్గ ఈ పుస్తకాన్ని స్వంతం చేసుకోవాలని భక్తులు విశేషంగా పోటీపడ్డారు. చివరకు జర్మనీకి చెందిన కొంతమంది హెన్రీ ప్రశంసకులు ఒక సంఘంగా ఏర్పడి అందరికంటే ఎక్కువ మూల్యాన్ని చెల్లించి స్వంతం చేసుకున్నారు.

సేకరణ : ఆర్. విజయలక్ష్మి ధనంజయ [కడప]

"బ్రాహ్మణుడైయుండి ఈ పని చేయడమా! అయినా అలాంటి పరిస్థితులలో భిక్షాన్నానికి వెళ్లొచ్చుగా? లేదా, మునుపటిలా కాకపోయినా, కాస్తో కూస్తో మంత్రాలు పల్లించి పొట్ట గడుపుకోవచ్చుగా? అది వదిలి ఇలా అందరి కాళ్ల చెప్పులు కాచుక్కూచోకపోతే, ఇలాంటివారి నుద్దేశించే ఆ సభలో అతను చెప్పింది" అన్నాడు నిరసనగా.

అందుకు రామారావు నొచ్చుకుంటూ, "నే నిచ్చిన డబ్బు తీసుకునేటప్పుడు ఆ ముసలతని చేయి ఎలా వణికిందో చూశారుగా! వార్ధక్యం మూలాన మంత్రాలు సరిగ్గా ఉచ్చరించలేడు. దోషపూరితమైన మంత్రోచ్ఛారణతో పూజెవరు చేయించుకుంటారు?

"ఇక భిక్షాన్నమంటే భిక్షమెత్తుకోవడమే. బిచ్చగాళ్లు కుల మతాలు పాటించక కడుపు నింపుకోడానికి అందరిళ్లలో మిగిలినవాటికి బిచ్చమెత్తితే, బ్రాహ్మణులు భిక్షాన్నం పేరిట కేవలం బియ్యం వగైరా తీసుకుంటారు. లేదా, వారాన్నం పేరిట బ్రాహ్మణుల ఇంట్లో మాత్రం భోజనం చేస్తారు. పెద్ద తేడా లేదుగా! అలా బిచ్చమెత్తి జీవించడం కంటే తన శక్తి పూర్తిగా ఉడిగేవరకూ తనకు చేతనైన పని చేసి జీవితం గడపాలని నిశ్చయించుకున్న ఉన్నతమైన వ్యక్తి.

"పెట్టుబడి లేక, కాస్త బాధ్యతను వహించి బ్రాహ్మణుడ ననే మాట ఆ క్షణాన మరిచి, మనసులో దేవుని సాన్నిధ్యాన గడుపుతున్నా నన్న భావనకు తావిచ్చి అభిమానంగా జీవితం గడుపుతున్న కర్మయోగి అతడు.

"బ్రాహ్మణుడై ఉండీ తక్కువ పనిచేస్తున్నాడని మనం, బ్రాహ్మణుడి వద్ద చెప్పులు వదిలితే పాపం చుట్టుకుంటుందని ఇతరులు అతడి వద్ద చెప్పులు వదలడం మానేస్తే అభిమానంగా బతకాలనుకున్న అతడికి అపకారం చేసినట్టే. అసహాయ స్థితిలో ఉన్న అతడిని ఆదుకోకపోవడమే అవుతుంది. అంచేతనే అతడి విషయం బాగా తెలిసిన నేను అతడి వద్దనే చెప్పులు వదిలేది. నేను ఎక్కువగా ఇచ్చే డబ్బుని కూడా ముందు తిరస్కరించేవాడు. ఎంతగానో సమాధానపరిచిన మీదట తీసుకోడానికి ఒప్పుకున్నాడు.

"అయినా ఆ సభలో అంత గొప్పగా ప్రసంగించిన ఆ మహానుభావుడు ఎవరనుకుంటున్నారు? అచ్చంగా ఈయన కొడుకే!"

చివరి మాట వినగానే పట్టాభి ముఖం పాలిపోయింది.

"అవునా!" అన్నాడు అతి కష్టమ్మీద మాటలు కూడబలుక్కుంటూ.

★

